సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



పీజీ కోర్సుల్లో..

జీఆర్‌ఏయూలోని పీజీ కోర్సుల్లో అంతంతమాత్రంగానే ప్రవేశాలు జరిగాయి. సగం సీట్లు కూడా నిండలేదు. -IIలో



ఈసీ సమావేశం కోసం..

జీఆర్‌ఏయూలో ఈసీ సమావేశం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. -IIలో



టీచర్ల బదిలీపై ఆందోళన..

చీమలవలస గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. టీచర్ల బదిలీపై నిరసన తెలిపారు. -IIలో

న్యూస్‌రీల్

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు



కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ.5,66,892ల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవదాయ శాఖాధికారి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు.

వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో పలు సామాజిక వర్గాల అనుబంధ విభాగాలకు 41 మందిని రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు, రాజాపు అప్పన్న, డీపీ దేవ్, దుక్క లోకేశ్వరరెడ్డిలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల పక్షపాతి అని మరోసారి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. అధ్యక్షులుగా నియమించేందుకు సహకరించిన పార్టీ పెద్దలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, జిల్లా పార్టీ పెద్దలకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

తేలినీలాపురంలో జిల్లా స్థాయి చదరంగ పోటీలు

టెక్కలి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామంలో జిల్లా స్థాయి చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వయో పరిమితి లేకుండా జిల్లాలో గల క్రీడాకారులు పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9912559735 నంబరుకు సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రూ.10 వేల బహుమతితో పాటు మెమెంటో అందజేస్తామని ప్రకటనలో తెలిపారు.

ఒక్క ఫోన్ కాల్‌తో..

శ్రీకాకుళం క్రైమ్ : ఆయన అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) అటాచ్డ్. చిత్తూరు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి నాన్‌క్యాడర్ ఎస్పీగా ఇటీవలే ఉద్యోగోన్నతి పొందారు. శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఎస్పీగా నియమిస్తూ సంబంధిత శాఖ జనరల్ డైరెక్టర్ హరీష్‌కుమార్ గుప్తా నుంచి బుధవారం ఉత్తర్వులు కూడా వచ్చాయి. దీంతో గురువారం ఉదయం శ్రీకాకుళం వచ్చి విధుల్లో చేరే ముందు అరసవల్లి వెళ్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. మరికొద్ది క్షణాల్లో తన చాంబర్‌లో చార్జ్ తీసుకుంటానని బయల్దేరడానికి సిద్ధమయ్యారు. ఇంతలోనే ఓ ఫోన్ కాల్ రావడంతో రామలక్ష్మణ సమీప గ్రాండ్ హోటల్ పైనున్న కార్యాలయానికి రాకుండానే ఆగిపోయారు. సాయంత్రం వరకు వేచి చూశారు. రాత్రి కూడా నగరంలోని ఓ హోటల్‌లోనే బస చేశారు. ఉదయం వరకు వేచి చూసి చార్జ్ తీసుకోకుండానే వెళ్లిపోయారు. ఆయనే ఉద్యోగోన్నతిపై మన జిల్లాకు వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ వై.బి.పి.టి.ఎ.ప్రసాద్. తన సన్నిహితుడిని ఈ పోస్టులో వేసేందుకు జిల్లాకు చెందిన మంత్రి ప్రసాద్‌ను ఫోన్ కాల్‌తో ఆపినట్లు చర్చ జరుగుతోంది.

మట్టి గణపతికి జై



ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టివినాయక విగ్రహాలు పంపిణీ చేసిన అమ్మ దేవస్థానం ధర్మకర్త శ్రావణ్‌కుమార్



కోటబొమ్మాళి: విద్యుత్‌నగర్ కాలనీలో దేవతల వేషధారణలో మట్టి గణపతుల పంపిణీ



శ్రీకాకుళం కల్చరల్: లయన్స్‌క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ వివేకానంద్

చవితి సందర్భంగా జనులంతా మట్టిమేలు తలపెట్టారు. పార్వతీ నందనుడి ప్రతిమలను మట్టితో తయారు చేసి విరివిగా పంపిణీ చేశారు. రసాయనాలు పూసిన విగ్రహాలు పర్యావరణానికి హాని చేస్తాయని, మట్టి విగ్రహాలు పరిసరాలకు మేలు చేస్తాయని వివరిస్తూ మట్టి గణపయ్యకు జై కొట్టారు.

గణాధీశుని ఆగమనం

కొండంత దేవుడు మనిషి చేతిలో పట్టేంతలా మట్టి రూపంలో ఒదిగిపోయాడు. హిమగిరుల్లో సేద తీరే స్వామి మామూలు మండపంలో ఆనందంగా కొలువుదీరాడు. శివపార్వతుల సమక్షాన్ని వదిలి నవరాత్రుల కోసం చవితి వేళ భక్తుల మధ్యకు విచ్చేశాడు. గజాననుని ఆగమనాన్ని ఘనంగా చాటుతూ ఊరూవాడా పందిళ్లు వేసి పండగను ప్రకటించాయి. ఉండ్రాళ్ల స్వామిని అర్చించేందుకు ఉత్సాహంగా ఏర్పాట్లు జరిగాయి. నీవు చూడగలిగితే సమస్త ప్రకృతిలోనూ తానున్నానని చెబుతూ శతకోటి రూపాల్లో గణపతి సాక్షాత్కరిస్తున్నాడు. -సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



శ్రీకాకుళంలో వినాయక ప్రతిమల విక్రయం



21 రకాల మొక్కల ఔషధ గుణాలను వివరిస్తున్న విద్యార్థులు

21 రకాల మొక్కలూ ఔషధాలే

నరసన్నపేట: వినాయక చవితి రోజున పూజా సమయంలో వినియోగించే 21 రకాల మొక్కల పత్రి(ఆకులు) ఔషధ గుణాలు కలిగినవేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత అన్నారు. శుక్రవారం కళాశాలలో బోటనీ, జువాలజీ, ఈకో క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి పూజా విధానంలో ఉపయోగించే 21 రకాల మొక్కల ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కళాశాల విద్యార్థులు కొన్ని గ్రూపులుగా ఏర్పడి 21 రకాల మొక్కల ప్రాముఖ్యాన్ని, ఔషధ గుణాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.పరమేశ్వరరావు, పి.అన్నాజీరావు, పి.పృథ్వీ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

30వేల విగ్రహాల పంపిణీ



ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా జిల్లా కేంద్రంలో దాదాపు ముప్పై వేల విగ్రహాలను పంపిణీ చేశారు. రికార్డు స్థాయిలో ఈ విగ్రహాల పంపిణీ జరిగింది. ఏడురోడ్ల కూడలి వద్ద జరిగిన పంపిణీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు పాల్గొన్నారు.

ఆమదాలవలస: చీమలవలస, కొత్తవలస, తొగరాం, నిమ్మతొర్లాడ, కట్యాచార్యులపేట, జీకే వలస, కొరపాం, గుత్తావిల్లి గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను అమ్మ దేవస్థానం నిర్మాణకర్త సనపల శ్రావణ్ కుమార్ పంపిణీ చేశారు.20 వేల విగ్రహాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.



పత్రి విక్రయం

మార్కెట్‌కు చవితి శోభ

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా మార్కెట్‌కు వినాయక చవితి కళ వచ్చింది. చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కళకళలాడాయి. జిల్లా కేంద్రంలో కళింగరోడ్డు నుంచి పెద్ద మార్కెట్‌కు వెళ్లే రహదారి, ఇల్లీసుపురం వద్ద గల రైతుబజారు జనాలతో ఉదయం 10గంటల నుంచి కిటకిట లాడాయి. ఉసిరి, నేరేడు, మామిడి, జాజి, మారేడు వంటి తొమ్మిరకాల పత్రిలకు మంచి డిమాండ్ కనిపించింది. చిన్న చిన్న వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై వాటిని కట్టలు కట్టి పది రూపాయల నుంచి పాతిక వరకు విక్రయించారు. తొమ్మిది రకాల పండ్లు కలిపి సెట్టు సైజును బట్టి కింద రూ.200ల వరకు అమ్మారు.



పత్రి, పళ్లు కొనుగోలు చేస్తున్న భక్తులు



కవిటి: ఈ ఏడాది ఉత్సవాల కోసం సిద్ధం చేసిన ముగ్ధ గణపతి విగ్రహం

ముగ్ధ మనోహర రూపం

కవిటి: కవిటి మండలంలోని బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాలను పర్యావరణానికి హాని కలిగించకుండా ఎకో ఫ్రెండ్లీ వినాయకుడిని వినూత్నంగా తయారు చేయడం ఆ క్లబ్ ప్రత్యేకత. అందులో భాగంగా ఈ ఏడాది (ముగ్ధ గణపతి) పెసర విత్తనాలు వేసి నారుతో తయారుచేసిన విగ్రహాన్ని క్లబ్‌కు చెందిన ప్రముఖ శిల్పి పైరి తిరుపతి తయారు చేశారు. 2012 నుంచి ఇప్పటివరకు ప్రతి ఏడాది ఎకో ఫ్రెండ్లీగా తయారు చేస్తూ వస్తున్నారు. కొబ్బరికాయల గణపతి (2012), నలుగు గణపతి (2013), వరినారు గణపతి(2014), వనమూలికల గణపతి (2015), పామాయిల్ గణపతి(2016), గోధుమ నారు గణపతి (2017), కొబ్బరి పువ్వుల గణపతి(2018), సుద్ద ముక్కల గణపతి(2019), నల్ల జీడిపిక్కల గణపతి(2021), ఆవాలు గణపతి(2022), పసుపు కొమ్ముల గణపతి(2023) విగ్రహాలను పర్యావరణానికి హాని కలిగించకుండా సహజ వనరులతో సజీవంగా ఉండే ఎకో ఫ్రెండ్లీ వినాయకుడి విగ్రహాలను తయారు చేస్తుండడంతో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులను సొంతం చేసుకున్నారు యూత్ క్లబ్ సభ్యులు. ఈ ఏడాది కూడా శిల్పి తిరుపతి మనం తినే ఆహారం పెసలుతో నారువేసి వాటిని మొలకెత్తించి ఈ గణపతిని తయారు చేశారు.

శోభాయమానం



ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలో కొబ్బరి, అరటి గెలలతో అందమైన పందిరి



ఇచ్ఛాపురం రూరల్: వినాయక చవితికి సిద్ధం చేసిన లడ్డూలు



నరసన్నపేట: కొత్తవీధిలో సిద్ధమైన గణేష్ మండపం

ఉద్యాన శాఖ ఉద్యోగులకు కలెక్టర్ అభినందన

- విజయవాడ వరద బాధితులకు ఉదారంగా సాయం
- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ :

విజయవాడ వరదల్లో చిక్కుకుపోయిన అక్కడి బాధితుల సహాయార్థం మన జిల్లా నుంచి ఉద్యానశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాలు చేయూతనందించడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. అక్కడి బాధిత ప్రజలకు భారీ ఎత్తున బియ్యం (వెయ్యి కిలోలు), వాటర్ బాటిల్స్ (వెయ్యి), బిస్కెట్టు ప్యాకెట్లు (వెయ్యి), అరటిపళ్లు 40 గెలలు, వంద కిలోల చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చిక్కుడు కాయలు, వంద ఆనపకాయలు అందించారు. వీటితో పాటు నిత్యావసర వస్తువులు నాలుగు ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో విజయవాడకు తరలించారు. వెళ్లే ముందు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పచ్చ జెండా ఊపారు. తోటి ప్రభుత్వ శాఖలు ఇలాంటి సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్, శ్రీకాకుళం ఉద్యాన సాంకేతిక అధికారి ఎం.అనూష, నాబార్డు డీడీఎం రామకృష్ణ, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్. చిత్రంలో డీహెచ్ఓ వరప్రసాద్ తదితరులు

జిల్లా పొదుపు సంఘాల మహిళల ఔదార్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా పొదుపు సంఘాల మహిళల ఔదార్యం ఆదర్శనీయమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ వరద ముంపు బాధిత ప్రజలను ఆదుకునేందుకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం చెక్‌ను మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం విజయవాడలో శ్రీకాకుళం జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీఆర్‌డీఏ పీడీ అందజేశారు. విపత్కర సమయంలో బాధిత ప్రజలను ఆదుకోవడానికి మహిళలు ముందుకు వచ్చి మానవత్వం చాటుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మహిళా సమాఖ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షులు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ముగిసిన పోరు

- స్టేట్ బ్యాడ్మింటన్ లీగ్ బాలుర సింగిల్స్ విన్నర్‌గా నుమేర్ షేక్, రన్నరప్ ఉమామహేష్
- బాలికల సింగిల్స్ విన్నర్‌గా పూజిత, రన్నరప్‌గా హర్షిక
- సత్తాచాటిన ప్రకాశం, గుంటూరు, విశాఖ, కర్నూలు, తూర్పు గోదావరి, కడప

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్స్ (అండర్-19) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శుక్రవారంతో జరిగాయి. ఏపీబీఏ, బాయ్ సహకారంతో శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు ముగిశాయి. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. క్రీడలకు ఒకశాఖ ఉంటుందని, దానికి నిధులు కేటాయింపు చేయాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని కూడా ప్రభుత్వాలు మరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.టోర్నీకి టైటిల్ స్పాన్సర్‌షిప్ అందించి బాసటగా నిలిచిన కిమ్స్ యాజమాన్యాన్ని, బ్యాడ్మింటన్ సంఘ జిల్లా చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావును, వ్యాపారవేత్త ఎన్‌వీ కిరణ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వం నుంచి సాయం లేకపోయినా..

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ప్రభుత్వం నయా పైసా సాయం చేయనప్పటికీ బ్యాడ్మింటన్ సంఘ జిల్లా నాయకులు టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి శభాష్ అనిపించారు. పోటీల నిర్వహణకు రూ.8లక్షలకు పైగా నిధులను వెచ్చించి సంఘ నాయకులు తలా చేయి వేసి పోటీలను సక్సెస్ చేశారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు, రిఫరీలకు, అఫీషియల్స్‌కు, తల్లిదండ్రులకు మంచి అతిథ్యాన్ని అందించి ప్రశంసలు అందుకున్నారు.



బాలికలు, మిక్స్‌డ్ డబుల్స్ విజేతలతో ఎమ్మెల్యే కూన రవికుమార్, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు

చాంపియన్లు వీరే..

- నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఏపీ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో భాగంగా బాలుర సింగిల్స్ ఛాంపియన్‌గా నుమేర్ షేక్ (ప్రకాశం) నిలిచాడు. రన్నరప్‌గా జి.ఉమామహేశ్వరరెడ్డి (వైఎస్సార్ కడప) నిలిచాడు.
- బాలికల సింగిల్స్ చాంపియన్‌గా జి.పూజిత (వైఎస్సార్ కడప) నిలవగా, ఎ.హర్షిక (విశాఖపట్నం) రన్నరప్‌గా నిలిచింది.
- బాలుర డబుల్స్‌లో ఎ.భార్గవ్‌రామ్ (గుంటూరు)-జి.విశ్వతేజ్ (వైఎస్సార్ కడప) జంట విజేతగా నిలవగా, కె.సాయిమోహిత్ (తూ.గో)-నుమేర్ షేక్ (ప్రకాశం) జంట రన్నరప్‌గా నిలిచింది.
- బాలికల డబుల్స్‌లో డి.దీపిక (గుంటూరు)-డి.స్రవంతి (గుంటూరు) జంట విజేతగా నిలవగా, ఎ.హర్షిత (విశాఖపట్నం)-ఎ.ప్రవల్లికమణి (విశాఖపట్నం)- జంట రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఫైనల్స్ తలపడిన వీరు ఇరువురు జంటలు సొంత అక్కచెల్లెళ్లు కావడం గమనార్హం.
- ఎండి కర్మత్ యావి హక్ (ప్రకాశం)-డి.దీపిక (గుంటూరు) జంట చాంపియన్స్‌గా నిలవగా, టి.కౌషిక్ (కర్నూలు)-ఎం.హాసనశ్రీ (విశాఖపట్నం) జంట రన్నరప్‌గా నిలిచి మెమోంటోలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.



బాలుర సింగిల్స్, డబుల్స్ విజేతలు

క్లుప్తంగా

యోగా కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని యోగా అండ్ ఫిట్నెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగా పీజీ డిప్లమా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు 30 శాతం రాయితీ ఫీజులో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని రూ.200 ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9603699414 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీకాకుళం కెల్లవీధిలో పర్యటించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని కెల్ల వీధిలో పర్యటించారు. అక్కడ చేపడుతున్న ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరును పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అక్కడ ప్రజలకు డ్రైడే ఫ్రైడేపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపాల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, బి.గణేష్ కుమార్, సచివాలయ, మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవు కడుపులో వ్యర్థాల తొలగింపు



ఆవు కడుపులోని వ్యర్థాలు

కోటబొమ్మాళి: నరసన్నపేట మండలం మడపాం గ్రామానికి చెందిన రైతు మర్ల గోపాలరావుకు చెందిన ఆవు కడుపులోని 15 కేజీల వ్యర్థాలను ఆపరేషన్ చేసి కురుడు పసువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ శుక్రవారం తొలగించారు. 10 రోజులుగా ఆవు మేత మేయకుండా ఉండటం, కడుపు ఉబ్బి ఉండటంతో కిరణ్‌కుమార్‌ను రైతు సంప్రదించాడు. దీంతో శుక్రవారం ఆవు కడుపులో వ్యర్థాలు ఉన్నట్లు గ్రహించి ఆపరేషన్ చేసి వ్యర్థాలను తొలగించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వృద్ధుడు

బూర్జ: కొల్లివలస గ్రామం నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు చికిత్స కోసం వెళ్లిన వృద్ధుడు శుక్రవారం మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలియ జేశా రు. ఆగస్టు 28న 108 వాహనంలో కొల్లివల స నుంచి రిమ్స్‌కి వెళ్లి వైద్యం పొందుతూ మృతి చెందడంతో రిమ్స్ అవుట్ పోస్టు నుంచి సమాచారం తెలియజేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు శ్రీకాకుళం రిమ్స్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

బంగారు సుధాకర్



సుధాకర్

ఎచ్చెర్ల: లావేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంజీవి నళినీ సుధాకర్ పతకాల పంట పండించారు. నేపాల్ దేశం పొకరపట్నంలో ఉన్న రంగసామి అంతర్జాతీయ క్రీడా ప్రాంగణంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీన వరకూ నిర్వహించిన పదో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ 60 ఏళ్ల వయస్సు గ్రూపులో పాల్గొని మూడు, ఐదు, పది కిలోమీటర్ల నడక పోటీల్లో రేస్‌వాకింగ్ చేసి మూడు బంగారు పతకాలను గెలుపొందారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ చరిత్రలో గత 50 ఏళ్ల కాలంలో ఎవరూ రేస్ వాకింగ్‌లో పాల్గొనలేదు. అలాంటిది సుధాకర్ మూడు బంగారు పతకాలతో చరిత్ర సృష్టించారు. ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జగన్నాథరావు, జిల్లా క్రీడాప్రాంగణ ముఖ్య శిక్షకులు కె.శ్రీధర్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు ఎల్.ఈశ్వరరావు, మురళీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, గ్రామపెద్దలు, క్రీడాభిమానులు అభినందించారు.

పీజీ కోర్సుల్లో 46 శాతం ప్రవేశాలు



- బీఆర్ఏయూలో 16 పీజీ కోర్సులు
- మొత్తం సీట్లు 562
- ప్రవేశాలు జరిగిన సీట్లు 259
- ఈ నెల 10లోపు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రం యూనిట్‌గా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీ సెట్-2024 అలాట్‌మెంట్‌లను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సగం సీట్లకు కూడా ప్రవేశాలు జరగలేదు. కొన్ని కోర్సుల్లో సింగిల్ డిజిట్ ప్రవేశాలు మాత్రమే జరిగాయి. వర్సిటీలో 16 పీజీ కోర్సులు ఉండగా, 562 సీట్లు ఉన్నాయి. 259 ప్రవేశాలు మాత్రమే జరిగాయి. 303 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు ఈ నెల 10వ తేదీ లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. లేదంటే ప్రవేశం కోల్పోతారు. త్వరలో రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ ఉన్నత విద్యా మండలి విడుదల చేయనుంది. ఈ కౌన్సెలింగ్‌లో కళాశాలలు, కోర్సులు మార్పు, గతంలో పీజీ సెట్‌లో ర్యాంకు వచ్చి హాజరు కానివారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి అవకాశం లభిస్తుంది.

కోర్సులు వారీ ప్రవేశాలు...

కోర్సు	సీట్లు	ప్రవేశాలు
ఇంగ్లీష్	40	25
తెలుగు	40	09
సోషల్ వర్క్	40	08
మాస్టర్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్	30	04
మాస్టర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్	40	08
రూరల్ డెవలప్‌మెంట్	40	07
ఎకనామిక్స్	40	10
ఎంకాం	40	39
ఎంఈడీ	40	10
బయెటెక్నాలజీ	33	31
మైక్రో బయోలజీ	22	20
అప్లైడ్ మ్యాథ్స్	22	06
మ్యాథ్స్	40	06
ఫిజిక్స్	40	22
అనలాటికల్ కెమిస్ట్రీ	22	22
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	32

చొక్కాకుల బంద ఆక్రమణల తొలగింపు



మన్నయ్యపేటలో చొక్కాకుల బంద స్థలం ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పురపాలక సంఘం ఆరో వార్డు పరిధిలోని కాళింగ మన్నయ్యపేటలో చొక్కాకుల బంద ఆక్రమణలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తొలగించారు. జేసీబీ సాయంతో సర్వే నంబర్ 290లో ఉన్న 5.60 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఆయకట్టు రైతులు చాలా సార్లు వినతులు అందించారన్నారు. ఈ నేపథ్యంలోనే వారి ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. చొక్కాకుల బంద ఆక్రమణలు తొలగిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

జలుమూరు: జలుమూరు సర్వే నంబరు 187-1ఎలో చిన్న ఊంద్ర బంద ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించడంతో వ్యవసాయ భూములకు సాగునీరు అందడం లేదని రైతులు సోమశేఖర్ బాబు,కోలా వర ప్రసాద్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రంలో ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే చోట ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి మళ్లీ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా మహాసభలు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న పీకేఎస్ఎస్ నాయకులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు జిల్లా అమర వీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 8న జరగనున్న ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఈ సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. నాటి సోంపేట థర్మల్ పోరాటం నుంచి నేటి జీడి కార్మికుల మద్దతు ధర వరకు అన్నింటిపైనా ఉద్యమాలు చేశామన్నారు. మహాసభలను ప్రజలు అన్ని విధాలుగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవాడ నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి పుచ్చ దుర్యోధన, జిల్లా నాయకుడు కారిపురుషోత్తం, మద్దిల ధర్మారావు, అందాల కోటి తదితరులు పాల్గొన్నారు.

ఈసీ సమావేశం కోసం సన్నాహాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సెల్) సమావేశం నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీన వర్చువల్ పద్ధతిలో మీటింగ్ నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నారు. అయితే విజయవాడలో వరదల నేపథ్యంలో వాయిదా పడే అవకాశం ఉందని కూడా అంటున్నారు. ప్రస్తుతం ఈసీ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వర్సిటీ వర్గాల్లో ఈ అంశాలు చర్చనీయాంశంగా మారాయి. రిజిస్ట్రార్ నియామకం ర్యాటిఫికేషన్ చేయటం, ప్రస్తుత అధికారులు నియమించిన 22 టీచింగ్, ఏడు నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలను ఆమోదించటం, నిమ్మ వెంకటరావు వీసీ సమయంలో నియమించిన 34 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు, మరో పక్క కాంటాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులు, నలుగురు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ తొలగింపు వంటివి అజెండాగా చేర్చినట్లు సమాచారం. అయితే పాలక మండలి ఆమోదం మీద అజెండా అమలు ఉంటుంది. ఇంత వరకు పాలక మండలి సమావేశాల్లో నియామకాలు తప్ప తొలగింపులు లేవు. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మరింది. విశ్వ విద్యాలయం అజెండా కాస్త రాజకీయ అజెండాగా మారటంపై ఇక్కడ వర్సిటీ వర్గాల్లో సైతం విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి.

అనుమతుల ముసుగులో అక్రమ వ్యాపారం



అంబళ్లవలసలోని సీజ్ చేసిన ఇసుక


గార: అనుమతుల ముసుగులో ఇసుకను దోచుకోవడానికి టీడీపీ నాయకులు ప్రణాళిక వేశారు. బూరవెల్లి, అంబళ్లవలస వద్ద సీజ్ చేసిన ఇసుక నుంచి శాంతి కన్‌స్ట్రక్షన్స్ పేరిట రైల్వే కాంట్రాక్టర్‌కు 500 టన్నుల ఇసుకను అందించేందుకు కలెక్టర్ అనుమతులిచ్చారు. వీటిని జిల్లా పరిధిలోని రైల్వే స్టేషన్ల వద్దనే ఇచ్చేందుకు అనుమతి ఉంది. అయితే రోజుకు 20 టన్నులు మాత్రమే తీసుకెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. ఇక్కడి నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ రైల్వే కాంట్రాక్టర్‌ను స్థానిక టీడీపీ నాయకుడు నిలువరించి ఇసుక తీసుకెళ్లకూడదని చెప్పారు. దీంతో ఆ కాంట్రాక్టర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో.. ప్రభుత్వ పనులకు ఇవ్వాల్సిందేనని కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన వాహనంతో రావడంతో ఆ టీడీపీ నాయకుడు మరిన్ని లారీలతో ఇసుకను తీసుకువెళ్తామని రాజకీయంగా ఒత్తిడి తీసుకువచ్చాడు. అయితే రోజుకి ఒక లారీకి మాత్రమే అవకాశం ఉందని చెక్‌పోస్టు సిబ్బంది చేతులెత్తేశారు. రోజుకి కనీసం 5 లారీలకు తక్కువ కాకుండా అనుమతులు ఇవ్వాలని చెప్పించేందుకు నాయకుడు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది.

ఎస్ఈబీ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నరసన్నపేట: స్థానిక జగన్నాథపురంలో నివాసం ఉంటున్న గుర్రాల అనూష అనే మహిళా కానిస్టేబుల్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనూష రణస్థలంలో ఎస్ఈబీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త కుమిలి విజయకుమార్ కూడా ఎస్ఈబీ కానిస్టేబులే. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఆమె గురువారం పురుగు మందు తాగేసిందని తల్లి అన్నపూర్ణమ్మ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేసిందని, తాను చూసే సరికి వాంతులు చేసుకుంటుండటంతో నరసన్నపేటలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించామని, పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనూష, విజయ భాస్కర్ ఇద్దరూ 2014 బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు. ఇద్దరూ ప్రేమించి 2018 లో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు నరసన్నపేటలో ఉంటూ చదువుకుంటుండగా అనూష గురువారం నరసన్నపేట వచ్చి తల్లి ఇంట్లో లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడింది.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు గిరడ రాజు (ఫైల్)



నందిగాం చెరువులో తేలిన గిడక రాజు మృతదేహం

నందిగాం, బూర్జ: నందిగాం ఎదురుబంద చెరువులో పడి బూర్జ మండలం అప్పలపట్నాయకునిపేటకు చెందిన గిరడ రాజు అలియాస్ చిన్నంనాయుడు (36) మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలపట్నాయకునిపేటకు చెందిన రాజుకు కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. రాజు మద్యానికి బానిసైపోవడంతో ఆమె రాజుతో ఉండలేక పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో రాజు తన తల్లితో కలిసి గ్రామంలో ఉంటూ బూర్జ మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో ఉన్న మణికంఠ దాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల మానసికంగా ఆందోళన చెందుతూ ఉండేవాడు. అదే దాబాలో పనిచేస్తున్న పంగ రాము అనే వ్యక్తితో కలిసి ఈ నెల 4న సోంపేట మండలం బెజ్జిపట్టుగలో ఉన్న భూత వైద్యుని వద్దకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని సోంపేటలో ఇద్దరూ మద్యం సేవించి, భోజనం చేసి శ్రీకాకుళం బస్ ఎక్కి శ్రీకాకుళం వరకు టిక్కెట్టు తీసుకున్నారు. బస్సులో ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు. అయితే రాజు నందిగాంలో బస్సు దిగిపోయాడు. రాము నిద్రలేచి కండక్టర్‌ను అడిగితే ఆయన ఈ విషయం చెప్పారు. దీంతో రాము ఇంటికి వచ్చేశారు. నందిగాంలో దిగిన రాజు గ్రామంలోని బజారుకు సమీపంలో ఉన్న ఎదురుబంద చెరువులో శుక్రవారం ఉదయం చెరువుకు స్నానానికి వెళ్లిన వారికి మృతదేహమై కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని ప్యాంట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ సిమ్ కార్డు సాయంతో పోలీసులు మృతుని వివరాలు కనిపెట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


టీచర్ల బదిలీపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



చీమలవలస ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిరసన తెలుపుతూ ఎంఈఓను నిలదీస్తున్న సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విద్యాశాఖ అధికారుల నిర్వాకంతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని పాఠశాల వద్దకు శుక్రవారం సర్పంచ్ సనపల చెల్లం నాయుడు, ఎఫ్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను బదిలీ చేయడంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 33 మంది ఉన్నారని, 6, 7, 8వ తరగతిలో మరో 30 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గతంలో ఈ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారని అందులో ఒక ఉపాధ్యాయుడు ఇటీవల రిటైరయ్యారని పేర్కొన్నారు. మిగిలిన ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురిని పని సర్దుబాటు పేరుతో చీమల వలస పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురు బదిలీపై వెళ్లిపోతే ఇద్దరు మాత్రమే తమ పాఠశాలలో మిగిలి ఉంటారని మిగిలిన ఇద్దరిలో ఒకరు మెడికల్ లీవ్‌పై ఉన్నారని తెలిపారు. పని సర్దుబాటులో భాగంగా చీమల వలస పాఠశాలకు ముగ్గురు ఎంటీఎస్ టీచర్లను నియమించారని, సబ్జెక్టు టీచర్లను పాఠశాలకు నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న మండల విద్యాశాఖ అధికారి-2 టి.గంగరాజును నిలదీశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని, తమకు ఎవరిపై కోపం లేదని అన్నారు. చీమలవలస పాఠశాలలో తెలుగు లాంగ్వేజ్ పండిట్‌ను పని సర్దుబాటు కింద బదిలీ చేయడానికి జీఓ వర్తించదని ఏ జీఓ ప్రకారం లాంగ్వేజ్ పండిట్‌ను లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారో తెలపాలని ఎంఈఓను సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీలు హై స్కూల్ విద్యార్థులకు క్లాసులు చెబుతున్నారని, దీనిపై దర్యాప్తు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ సమర్థవంతమైన టీచర్లను నియమించకపోవడంపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను మార్చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులపై కలెక్టర్, విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎంసీ చైర్మన్ బొడ్డేపల్లి వైకుంఠరావు అన్నెపు రమణమూర్తి నీలయ్య విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



సుజాత (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి ఘర్షణతో మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మపురం గ్రామానికి చెందిన రంగాల నూకయ్యతో టి.బరంపురం పంచాయతీ కొత్తూరు గ్రామానికి సుజాతకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. నూకయ్య గల్ఫ్ ప్రాంతాలకు వలస కూలీగా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య వాగ్వా దం చోటుచేసుకుంది. దీంతో ఆమె భర్తపై కోపంతో గురువారం బాడీ లోషన్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యు లు ఆమెను హుటాహుటిగా బరంపురం పెద్దాస్పత్రికి తరలించారు. అక్కడే ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కాశీబుగ్గ వాసి మృతి



రోణంకి ప్రవీణ్‌కుమార్

కాశీబుగ్గ: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం దివాన్ చెరువు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కాశీబుగ్గ డెంకివీధికి చెందిన రోణంకి ప్రవీణ్‌కుమార్ (20) మృతి చెందాడు. తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ చనిపోయారు. ప్రస్తుతం ప్రవీణ్‌కుమార్ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడి మృతి వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

కొట్లాట కేసులో 8 మందికి జరిమానా

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో 2020లో జరిగిన ఓ కొట్లాటకు సంబంధించి ఎనిమిది మందికి జరిమానా విధించారు. జి.సిగడాం పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. 2020 సంవత్సరంలో గ్రామంలో జరిగిన కొట్లాటలో గాయపడిన డోల అసిరినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో చిత్తిరి ఈశ్వరరావు, చిత్తిరి చెల్లమ్మ, పాగిరి ప్రకాశ్, డబ్బాడ మోహన్‌బాబు, చిత్తిరి లక్ష్మణ, డబ్బాడ గౌరునాయుడు, డబ్బాడ తమ్మి నాయుడు, అలియా స్ గిరిబాబు, డబ్బాడ గుణ అలియాస్ జ్ఞానేశ్వరమ్మలకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పన జరిమానాను పొందూరు ఫస్ట్ క్లాస్ జూనియర్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి బి.జ్యోత్స్న విధించి తీర్పు చెప్పినట్లు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. అసిరినాయుడు తరఫున ఏపీపీ రొక్కం శాంతి సంతోషి వాదించినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలం చెల్లిన మందులు అమ్మిన వ్యక్తికి జైలు, జరిమానా


పొందూరు: ఔషధ చట్టం నిబంధనలు అతిక్రమించిన పైడి జగన్నాథం అనే వ్యక్తికి పొందూరు కోర్టు ఒక రోజు జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధించినట్లు పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కింతలి గ్రామంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, అధికారులు మెడికల్ దుకాణంపై 2019లో తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో శివగణేష్ మెడికల్ స్టోర్‌లో కాలం చెల్లిన మందులు, 19 రకాల ఫిజీషియన్ శాంపిల్స్ ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. దీనిపై నేరం నిరూపణ కావడంతో యజమాని పైడి జగన్నాథంకు శిక్ష ఖరారు చేశారని ఎస్ఐ తెలిపారు.

కొనుగోలుదారుడికి న్యాయం చేయలేదు.. డబ్బు కట్టండి

శ్రీకాకుళం పాత బస్టాండ్: రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఇంటి స్థలం కోసం డబ్బు కట్టిన కొనుగోలుదారుడికి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి అప్పగించడంలో విఫలమైన విశాఖపట్నానికి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ఇన్నా డెవలపర్స్ ప్రతినిధులు వినియోగదారుడికి అతను డిపాజిట్ చేసిన మొత్తం, అదనంగా పరిహారం చెల్లించాలని శ్రీకాకుళం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ గురువారం తీర్పునిచ్చింది. ఫిర్యాదిదారు తరపు న్యాయవాది, చౌదరి లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీఆర్ మూర్తి అనే వ్యక్తి ఇన్నా డెవలపర్స్‌కు చెందిన భీమిలి మండలంలోని వెంచర్‌లో ఇంటి స్థలం కోసం రెండు దఫాలుగా బ్యాంకు చెక్కుల ద్వారా రూ.నాలుగు లక్షలు డిపాజిట్ చేశారు. కానీ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వినియోగదారుడు తన న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ద్వారా శ్రీకాకుళం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం కమిషన్ అధ్యక్షులు రఘు పాత్రుని చిరంజీవి, సభ్యులు, జి.రాధారాణి, సీహెచ్ షణ్ముఖ రావు గురువారం వినియోగదారునికి న్యాయం చేస్తూ తీర్పు వెలువరించారు. డిపాజిట్ చేసిన నాలుగు లక్షల రూపాయలు, తొమ్మిది శాతం వడ్డీ, కోర్టు ఖర్చుల కింద మరో రూ.10,000, మానసిక వేదనకు పరిహారంగా రూ.25,000 వినియోగదారునికి తీర్పు వెలువడిన 45 రోజుల్లో చెల్లించాలని పేర్కొన్నారు.

తగ్గుముఖం దిశగా మహేంద్రతనయ



పాతపట్నం వద్ద తగ్గుముఖం పట్టిన మహేంద్ర తనయ నది

పాతపట్నం: మహేంద్ర తనయ నది ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై కింద నుంచి నీరు పారడం తగ్గుముఖం పట్టింది. పాతపట్నంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు పంట పొలాల్లో నీరు చేరింది.